సాక్షి వికారాబాద్

శనివారం । 6 । మే । 2023



కొలిచేవారేరి..?
జిల్లా పరిధిలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో భూముల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. 8లో▸



పరీక్షల నిర్వహణలోనూ..
పోటీ పరీక్షల నిర్వహణలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ ధారాసింగ్ అన్నారు. 8లో▸



అరకొర కోటాతో అవస్థలు
రేషన్ బియ్యం అందించాలంటూ దోమ మండలం గుండాలలోని రేషన్ దుకాణం ఎదుట గ్రామస్తులు నిరసన చేపట్టారు. 9లో▸

న్యూస్‌రీల్

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన



ఎన్నెపల్లి అంగన్వాడీ కేంద్రంలో ట్రెయినీ కలెక్టర్ సంచిత్ అగర్వాల్ తదితరులు

వికారాబాద్ అర్బన్: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ పథకాలు ఎలా అమలవుతున్నాయనే దానిపై ట్రెయినీ కలెక్టర్ సంచిత్ అగర్వాల్ శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారితో కలిసి పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లిలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన పిల్లల హాజరుపై ఆరాతీశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. గర్భిణులకు,బాలింతలకు అందిస్తున్న సదుపాయాలపై అధికారిని అడిగి తెలుసుకున్నారు. సేవలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని శిశు గృహను సందర్శించారు.

ట్రాన్స్‌జెండర్లూ.. దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు జాతీయ గుర్తింపు పత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ట్రాన్స్‌జెండర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే జాతీయ గుర్తింపు పత్రం పొందినట్లయితే ఆర్థిక పునరావాస పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం కలెక్టరేట్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని లేదంటే..73969 08597ను సంప్రదించాలన్నారు.

21 మంది హెడ్ కానిస్టేబుళ్ల బదిలీ



హెడ్ కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో 21 మంది హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీలు చేశారు. ఈమేరకు ఎస్పీ కోటిరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు చేపట్టామన్నారు. సీనియారిటీ లిస్టు ప్రకారం బదిలీలు చేపట్టామని తెలిపారు. విధి నిర్వహణ, క్రమశిక్షణ, నీట్ టర్న్అవుట్‌లలో ఆదర్శంగా ఉండాలన్నారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదిదారులకు న్యాయం అందేవిధంగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. పీఎస్‌లలో వర్టికల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, పరిగి డీఎస్పీ కరుణసాగర్, ఏఓ వందన, డీఎస్‌బీ రామకృష్ణ, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, డీపీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన జీపీఎస్‌ల సమ్మె



సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు, నాయకులు

అనంతగిరి: జేపీఎస్, ఓపీఎస్‌లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, లక్ష్యాలు నెరవేర్చడంలో కీలకపాత్ర పోషించామన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు జేపీఎస్, ఓపీఎస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉత్తమ క్రీడాకారుల వివరాలివ్వండి’

అనంతగిరి: రాష్ట్ర సారస్వత పరిషత్ సౌజన్యంతో జిల్లా సమగ్ర చరిత్ర అనే గ్రంథం రూపొందిస్తున్నట్లు డైట్ విశ్రాంత ఉపన్యాసకుడు బందెప్పగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్, అవార్డులు, చాంపియన్‌షిప్‌లు పొందిన క్రీడాకారులు తమ సమాచారం తెలియజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94410 36747, 99086 52159 నంబర్లలో సంప్రదించాలన్నారు.



రాష్ట్రానికే తలమానికం.. హెరిటేజ్ టవర్



400 అడుగుల ఎత్తు
- రూ.200 కోట్లతో నిర్మాణం
- 8న సీఎం కేసీఆర్ భూమిపూజ



మాట్లాడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

మణికొండ: మన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాల శిల్ప సౌందర్యాలను మోడ్రన్ పద్ధతిలో ప్రపంచానికి తెలియజేసేందుకు ఉద్దేశంతో నగర శివారు నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌ను నిర్మిస్తున్నామని, అది రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణ గోశాల వారు జీవితకాల దానంగా ఇచ్చిన 6 ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో 400 అడుగుల ఎత్తు దేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. తిరుమల దేవాలయ గెటప్‌తో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, మధుర, బృందావనం గెటప్‌తో శ్రీకృష్ణదేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. మ్యూజియం, లైబ్రరీ, థియేటర్లతో పాటూ దేవాలయాల్లో జరిగే పూజలు ఆలయ టవర్‌పై లైవ్ ప్రదర్శన ఉంటుందన్నారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వచ్చే పర్యాటకులకు ఓ కేంద్రంగా ఇది నిలుస్తుందన్నారు. ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయని, సీఎం కేసీఆర్ చేతులమీదుగా ఈనెల 8న ఉదయం 11.30గంటలకు ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుగుతుందని ఆయన తెలిపారు.

నీటిబొట్టు.. ఉంటే ఒట్టు

మూగ గోస ఎవరికీ పట్టడంలేదు. అసలే భగభగ మండే ఎండలతో పశువులు దాహార్తితో అలమటిస్తున్నాయి. గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో వృథాగా మారాయి. వీటి కోసం వెచ్చించిన రూ.1.39 కోట్లు నేలపాలయ్యాయి. పంచాయతీల నిర్లక్ష్యం వల్ల అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గుక్కెడు నీళ్లు దొరకక పశువులు విలవిల్లాడుతున్నా పాలకులకు నీటి వసతి కల్పించాలన్న ధ్యాస రాకపోవడం గమనార్హం.

నిరుపయోగంగా నీటితొట్లు
- దాహంతో అల్లాడుతున్న పశువులు
- వృథా అయిన రూ.1.39 కోట్ల నిధులు
- దృష్టిసారించని పాలకులు



బొంపల్లితండాలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

వికారాబాద్: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఐదేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి తొట్లు నిర్మించారు. ఇందుకు ప్రభుత్వం రూ.1.39కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.18 వేల నుంచి రూ.30వేల వరకు వెచ్చించి వీటిని నిర్మించారు. వీటి నిర్వహణ చూసుకోవాల్సిన పంచాయతీ పాలకమండలి మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని మోత్కూరు, ఐనాపూర్, బాస్పల్లి, బొంపల్లి గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు నేలమట్టమయ్యాయి.

నీటి వసతి లేకున్నా..

పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ఈ నీటి తొట్లను నింపేందుకు నీటివసతి ఉందో లేదో.. గమనించ లేదు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. నిర్మాణ బాధ్యతలను ప్రజాప్రతినిధులకే అప్పగించారు. ఇదే అదనుగా భావించిన కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా నిర్మించారు. దీంతో అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. నిర్మించిన ప్రదేశానికి నీటి వసతి ఉందో లేదో గమనించలేదు. వసతి ఉన్న తొట్లలోకి నీటిని సరఫరా చేసే పైపుల కనెక్షన్ ఇవ్వలేదు.

617 నీటి తొట్లు..

ఉపాధి హామీ పథకం కింద అవసరమైన గ్రామాల్లో 617 నీటి తొట్లను నిర్మించేందుకు నిర్ణయించారు. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.18వేల చొప్పున ప్రభుత్వం జిల్లాకు 1.39కోట్లు నిధులను మంజూరుచేసింది. ఇందులో 400 పైచిలుకు తొట్లు నిర్మించగా మిగిలినవి నిర్మించకుండా వదిలేశారు. ఈ తొట్లను అనువైన చోట నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిర్మించాలనే నిబంధనలు ఉన్నా చాలా వరకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులే నిర్మించారు. నీటి వసతిలేనిచోట, నాసిరకంగానూ నిర్మించడంతో తొట్లలో ఏనాడూ నీటిబొట్టు కనిపించలేదు.

ఏడు లక్షలకుపైగా జీవాలు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం మూగజీవాలు 7,23000 ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. తొట్లు అవసరంలేనిచోట నిర్మించడంతో నిరుపయోగంగా పడిఉన్నాయి. గ్రామపంచాయతీ బోర్ల నుంచి తొట్లకు నీరు సరఫరా చేయాల్సి ఉన్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. దీంతో లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా అయ్యాయి. సదాశయంతో నిర్మించిన తొట్లు నిరుపయోగంగా ఉన్నా వినియోగంలోకి తేవాలనే సంకల్పం ఎవరిలోనూ లేకపోయిందని రైతులు వాపోతున్నారు. తొట్లవద్దకు పశువులు వచ్చి నీళ్లు లేపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నాయి.

సమన్వయలోపం..

తొట్లు వినియోగంలోకి తేవడానికి పశుసంవర్ధకశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నా ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా తయారైంది. తొట్లకు నీటి సరఫరా చేసే విషయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం చర్యలు తీసుకోవాలి. ఇందుకు గాను గ్రామస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ సహకరించాలి. ఈ ప్రక్రియను పశుసంవర్ధక శాఖ పర్యవేక్షించాల్సి ఉంది. అయినప్పటికీ వీరిమధ్య సమన్వయలోపం కారణంగా పశువులకు గుక్కెడు నీరు లభించడం కష్టంగా మారింది. కనీసం గ్రామ ప్రజాప్రతినిధులైనా స్పందించి నీటితొట్లను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

చక్కటి పఠనం.. చక్కని ప్రోత్సాహం

- వేసవి పఠనా శిబిరాల నిర్వహణ భేష్
- సీఎస్ఎఫ్ ఢిల్లీ ప్రతినిధుల కితాబు
- వలంటీర్లకు అభినందనలు

కొడంగల్ రూరల్ : వేసవి పఠనా శిబిరాల నిర్వహణ, ప్రోత్సాహం బాగుందని సీఎస్ఎఫ్ ఢిల్లీ ప్రతినిధులు కితాబునిచ్చారు. శుక్రవారం మండలంలోని అప్పాయిపల్లిలో కొనసాగుతున్న పఠనా శిబిరాలను సీఎస్ఎఫ్ ఢిల్లీ ప్రతినిధులు పార్థ, శాలెట్‌లు పరిశీలించారు. విద్యార్థులచే కథల పుస్తకాలను చదివించారు. పిల్లలు రోజూ రెండు గంటలు సమయం కేటాయించడం, పఠనం వైపు ఆసక్తి కలిగించడం బాగుందన్నారు. విద్యార్థులను కథల పుస్తకాలను చదివిస్తూ, వారిచే సొంతంగా కథలు చదివిస్తూ విద్యార్థులను అభినందించారు. వేసవి కాలంలో ఇలా చదువుకోవడంతో చదువుపై చక్కటి అవగాహన వస్తుందన్నారు. పిల్లలు గీసిన బొమ్మలు బాగున్నాయని, వీరిని ఇలాగే ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ఇన్‌చార్జి ఘటమనేని సురేశ్, జిల్లా సెక్టోరియల్ అధికారి రవికుమార్‌లు చిన్నారుల విద్యాభ్యాసాన్ని ప్రశంసించారు. వేసవి పఠనా శిబిరాలను సందర్శించిన అనంతరం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సీఎస్ఎఫ్ డిల్లీ ప్రతినిధులకు వేసవి పఠనా శిబిరాల గురించి వివరించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ఇదే విధంగా కొనసాగిస్తే మంచి ఫలితాలు ఉంటాయనే ఉద్దేశంతో జిల్లాలో పఠనా శిబిరాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో వలంటీర్లకు అవగాహన కల్పిస్తూ పఠనా శిబిరాలను పెంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయులు మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నారని అన్నారు. వచ్చే ఏడాది అభ్యాసన ఫలితాలు సాధించేటట్లు ప్రణాళికలు రూపొందించామని ప్రతినిధులకు వివరించారు. విద్యార్థులు గత సంవత్సరం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నేర్చుకున్న అంశాలు మర్చిపోకుండా ఉండేందుకు (లర్నింగ్ గ్యాప్ లేకుండా) పఠనా శిబిరాలు ఉపయోగపడతాయని అన్నారు. వలంటీర్ల సహకారంతో మొత్తం 58 వేసవి శిబిరాలు నడుస్తున్నాయని, ఎన్‌జీఓల సహకారంతో మరో 62 వేసవి పఠనా శిబిరాలు నిర్వహిస్తున్నామని ఏఎంఓ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గీతాఠాకూర్, ఉపాధ్యాయులు వెంకటయ్య, వీరేశం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారుల అభ్యాసనాన్ని పరిశీలిస్తున్న సీఎస్ఎఫ్ ఢిల్లీ ప్రతినిధులు

17 ఏళ్ల క్రితం తప్పిపోయి..



షేక్ మస్తాన్ తో కుటుంబసభ్యులు

అనూహ్యంగా తల్లిదండ్రుల చెంతకు..
- కుటుంబ సభ్యుల దగ్గరికి చేర్చిన భార్యాభర్తల గొడవ
- మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఘటన

అనంతగిరి: సుమారు 17 ఏళ్ల క్రితం తప్పిపోయిన ఓ వ్యక్తి అనూహ్యంగా తల్లిదండ్రుల చెంతకు చేరడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది కలనా.. నిజమా అని వారు సంభ్రమాశ్చర్యంలో మునిగి తేలారు. ఒక కేసు వీరిని ఒకే వేదికపై తీసుకొచ్చింది. ఈ సంఘటన తాండూరు మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన షేక్ పీర్ సాబ్‌- జైబున్నిసా దంపతులకు ఏడుగురు సంతానం, వీరిలో నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. రెండో కుమారుడు షేక్‌మస్తాన్ 17 సంవత్సరాల క్రితం తన మేనమామ అబ్దుల్ రహీం వెంట హైదరాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి ఇద్దరి ఆచూకీ దొరకలేదు. కుటుంబ సభ్యులు కొన్నాళ్లు వెతికినా ఫలితం లేకుండా పోవడంతో చేసేదేమి లేక ఆశలు వదులుకున్నారు. కాగా మొదటి భార్యతో విడిపోయిన షేక్ మస్తాన్ తాండూరుకు చెందిన తబస్సుం బేగంను రెండో పెళ్లి చేసుకున్నాడు. భర్త తరచూ వేధిస్తున్నాడని తబస్సుమ్ తల్లిగారింటికి వచ్చింది. వికారాబాద్ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో హైదరాబాద్‌లోని మౌలాలిలో నివాసం ఉంటున్న మస్తాన్‌ను పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలిచారు. పోలీస్‌స్టేషన్ దగ్గర తన చిన్ననాటి మిత్రుడు శివ అతన్ని గుర్తించాడు. విషయాన్ని మరో మిత్రుడు ఇమ్రాన్‌కు సమాచారం అందించాడు. హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌లో హోటల్ నడుపుతున్న షేక్ మస్తాన్ కుటుంబ సభ్యులకు అతను సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు వికారాబాద్ సీఐ ప్రమీలను సంప్రదించారు. ఈ నెల 5న కౌన్సెలింగ్ ఉందని, మీరు రావాల్సిందిగా కోరడంతో వారు శుక్రవారం వచ్చారు. మస్తాన్‌ను చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. భార్యతో సఖ్యతతో ఉండాలని కుమారుడికి తల్లిదండ్రులు హితవు పలికి ఇద్దరిని కలిపారు.

తప్పులు సరిచేయండి

- ఆర్‌డీఓ అశోక్‌కుమార్
- ఓటరు జాబితాపై అధికారులకు దిశానిర్దేశం

కొడంగల్ : అన్ని మండలాల్లో ఓటరు జాబితాలోని తప్పులను సరి చేయాలని ఆర్డీఓ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్లు, బూత్ స్థాయి సూపర్‌వైజింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక కుటుంబానికి సంబంధించి ఆరుగురు ఓటర్లు ఉంటే ఆ ఇంటి నంబర్‌ను విభజించి కొత్త నంబరు నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేరును తొలగించాలని ఆదేశించారు. వలస వెళ్లిన వారి పేర్లను విచారణ చేసి వారికి నోటీస్ ఇచ్చిన తర్వాత తీసివేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు కృష్ణయ్య, భీమయ్యగౌడ్, ఎన్నికల ఉప తహశీల్దార్ శివకుమార్, కొడంగల్ డీటీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ అశోక్‌కుమార్

స్వయంగా ఇంటికి వెళ్లి పరిశీలించాలి..

అనంతగిరి: ఒకే ఇంటినంబర్ పైన ఆరుగురు కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే బీఎల్‌ఓలు స్వయంగా వెళ్లి పరిశీలించాలని ఆర్‌డీఓ విజయకుమారి సిబ్బందికి సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన వారు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటును తొలగించే సమయంలో తప్పకుండా విచారించి వివరణతో తొలగించాలన్నారు. బోగస్ ఓటర్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మంత్రి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే.. నగరంలోని ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

– అనంతగిరి



క్లుప్తంగా

పెళ్లి మండపంలో ఫొటోగ్రాఫర్ మృతి


అశోక్ (ఫైల్)

తాండూరు టౌన్: వివాహ వేడుకలో వధూవరుల ఫొటోలు తీస్తుండగా ఓ ఫొటో గ్రాఫర్ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. పాత తాండూరుకు చెందిన అశోక్ (45) స్థానిక మహేశ్వరి ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. శుక్రవారం కందనెల్లి సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌లో జరుగుతున్న వివాహ కార్యక్రమానికి ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. వివాహం పూర్తయిన తర్వాత గార్డెన్‌లో వధూవరుల ఫొటోలను తీస్తుండగా అశోక్ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 20 ఏళ్లుగా ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలోనే మృతి చెందాడని తోటి ఫొటోగ్రాఫర్‌లు విచారం వ్యక్తం చేశారు. అశోక్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి

అనంతగిరి: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన అంజయ్య(45), మల్లేశం బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మద్గుల్ చిట్టంపల్లి వద్ద వీరి బైక్‌ను లారీ ఢీకొట్టడంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశంను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరిస్తున్నారు.

రోజూ రూ.272 వచ్చేలా ‘ఉపాధి’ చూపండి

- డీఆర్‌డీఓ కృష్ణన్


ఉపాధి పనులను పరిశీలిస్తున్న కృష్ణన్

యాలాల: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు రోజు రూ.272 వచ్చేలా మార్కింగ్ చేసి పనులు కల్పించాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జుంటుపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. జుంటుపల్లిలో చేపడుతున్న ప్రాజెక్టు కాల్వల పూడికతీత, చెరువుల్లో పూడికతీత, నర్సరీల్లో మొక్కల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.257 నుంచి రూ.272 కు పెంచిందన్నారు. పెంచిన కూలీ అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వ లు, చెరువుల్లో పూడికతీత పనులతో భూగర్భజలాలు పెరిగేందుకు అవకాశం ఉందని, రైతులకు ఉపయోగకరంగా ఉండే పనులను పూర్తి స్థాయిలో చేపట్టాలని సూచించారు. ఎఫ్‌ఏలు, టీఏలు మస్టర్లలో కొట్టివేతలు లేకుండా చూడాలన్నారు. పనికిరానీ వారి పేర్లపై మస్టర్ల నిర్వహణ చేయరాదన్నారు. అనంతరం జుంటుపల్లి రామస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఏపీఓ జనార్ధన్, ఈసీ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

కందుకూరు: విద్యుదాఘాతంతో ఓ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని సత్యనారాయణకు చెందిన ఇంటిని ఓ మహిళకు అద్దెకు ఇచ్చాడు. ఆమె శుక్రవారం ఉదయం పనిపై బయటికి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో విద్యుదాఘతంతో మంటలు చెలరేగడంతో ఇరుగు పొరుగు వారు గుర్తించి మంటలార్పేశారు. కాగా అప్పటికే ఇంట్లోని విలువైన వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో బాధితురాలు కన్నీరుమున్నీరయింది.

కొలిచేవారేరి..?

- వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- 3 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు


భూ సర్వే చేసుకుంటున్న రైతులు(ఫైల్)

దౌల్తాబాద్: రైతుల మధ్య భూతగాదాలు తలెత్తినప్పుడు ఆ భూమిని కొలిచి సమస్యను పరిష్కరిస్తారు. అయితే జిల్లా పరిధిలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉండడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుతున్నా పరిష్కారం లభించక ఇబ్బంది పడుతున్నారు.

‘ధరణి’తో పెరిగిన భూ వివాదాలు

భూముల హద్దులు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు తేల్చడానికి భూములను సర్వే చేస్తారు. జిల్లా పరిధిలో సర్వేయర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రైతులకు సకాలంలో సేవలు అందడంలేదు. 20 మండలాలకు గాను 12 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. మరోవైపు ధరణి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భూ వివాదాలు పెరిగిపోయాయి. సర్వే చేసి భూసమస్యలను పరిష్కరించాలంటూ రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. సర్వేయర్ల కొరత కారణంగా అవి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

గడువు నిబంధన గాలికి..

భూ సర్వేకు రైతులు దరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లోగా సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. సర్వేయర్లు రికార్డుల ఆధారంగా సర్వే చేసి హద్దులు, విస్తీర్ణం తేల్చాలి. కానీ జిల్లాలో సర్వేయర్ల కొరత కారణంగా నెలలు గడుస్తున్నా దరఖాస్తులకు మోక్షం లభించడంలేదు. సమస్య పరిష్కారించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్లతో పనులు చేయించుకోవాలని సూచించడంతో ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించుకుంటున్నామని రైతులు తెలిపారు.

పరికరాలు లేక....

గతంలో గొలుసు పద్ధతిలో భూములను కొలిచేవారు. ప్రస్తుతం జీపీఎస్ పరికరంతో కొలతలు వేస్తున్నారు. ఈ పరికరానికి రూ.15నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతోంది. ప్రభుత్వం పరికరాలను సమకూర్చకపోవడంతో సర్వేయర్లే సొంతంగా కొనుగోలు చేసుకుంటున్నారు.

అడిగినంత ఇస్తేనే....

ధరణి పోర్టల్‌లో చిన్నపాటి సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్‌లో భూములు కనిపించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా సర్వేయర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు విసిగిపోయి సర్వేయర్లు అడిగినంత ఇచ్చి సర్వే చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

జిల్లాలో 20 మందికిగాను 12 మంది సర్వేయర్లు ఉన్నారు. సిబ్బంది కొరతతో సర్వేలు ఆలస్యం అవుతున్నాయి త్వరలో దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– మధురాంరెడ్డి, ఏడీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వికారాబాద్

బీఆర్‌ఎస్‌తోనే సమ న్యాయం

ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రేమ్‌కుమార్, నాయకులు

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నేతలు పార్టిలో చేరుతున్నారని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణ బీజేపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరుతో విసుగుచెందిన నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రవికుమార్, శ్రీశైలం, నాగేశ్, రాఘవపురం సర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు దీక్ష చేస్తాం

- తట్టెపల్లి మండల సాధన సమితి సభ్యులు
- 29వ రోజుకు చేరిన రిలే దీక్ష


నిరసన తెలుపుతున్న తట్టెపల్లి మండల సాధన కమిటీ సభ్యులు

పెద్దేముల్: తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్షను విరమించేదిలేదని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్ స్పష్టం చేశారు. తట్టెపల్లి చౌరస్తాలో తట్టెపల్లి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారానికి 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు గోపాల్, శంకర్ మాట్లాడుతూ.. తట్టెపల్లి అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తట్టెపల్లి ప్రజల తలరాతలు మారడం లేదన్నారు. ప్రభుత్వం తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించేవరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ తట్టెపల్లి గ్రామ రైతు సమన్వయ కోఆర్డినేటర్ ఏసప్ప, మాజీ సర్పంచ్ గెమ్యానాయక్, బక్కప్ప, దేవప్ప, మహబుబ్, పండరి, సంగప్ప, సోఫీపటేల్, ఇమ్రాన్, రాజు, ముక్తార్, సలీమ, జులిక, బీలాల్‌బీ, లక్ష్మమ్మ, బాలమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల్లో ఆనందం

రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

బొంరాస్‌పేట: అలుపెరుగని విధుల నిర్వహణ, చాలీచాలని వేతనం ఎప్పుడెప్పుడు ప్రభుత్వ అధ్యాపకులుగా నియమించబడుతామోననే ఆశ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నెరవేర్చింది. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఉత్తర్వులు అందాయి. దీంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది.

తొమ్మిది కళాశాలలు.. 75మంది

జిల్లాలోని కొడంగల్, పరిగి, దోమ, తాండూరు, వికారాబాద్, పెద్దేముల్, నవాబ్‌పేట, మోమిన్‌పేట, మర్పల్లి జూనియర్ కళాశాలల్లో ఏళ్ల నుంచి 75 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరిని సీఎం కేసీఆర్ ఇటీవల రెగ్యులర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) శంకర్ నాయక్ వారికి ఉత్తర్వులు అందజేశారు. కొడంగల్ మండల పరిధిలోని అంగడిరాయచూర్‌కు చెందిన కిష్టప్ప (పొలిటికల్ సైన్స్) అధ్యాపకులుగా మద్దూరులో 2000 సంవత్సరం నుంచి రూ.5వేలు వేతనం, ఏడాదికోసారి అందుకుంటూ విధులు నిర్వహించాడు. మొగిలిగిద్ద 2013 నుంచి పదేళ్లు పనిచేశాడు. 2023 ఏప్రిల్ నుంచి తాండూరు ప్రస్తుతం రూ.54,220 అందేది. రెగ్యులరైజ్ కావడంతో వేతనంతోపాటు అదనంగా హెచ్‌ఆర్‌ఏ, డీఓ ఇతర అలవెన్సులు కలిపి మొత్తం రూ.75వేల నుంచి రూ.80వేల వరకు వేతనం అందనుంది. జిల్లాలోని 75 మంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు రుణపడిఉంటామన్నారు.

పరీక్షల నిర్వహణలోనూ విఫలం

- 8న యువ సంఘర్షణ సభ
- పీసీసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ ధారాసింగ్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: పోటీ పరీక్షల నిర్వహణలోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ ధారాసింగ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని సిండికేట్ భవనంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. కర్ణాటకలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. మన రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగ యువతకు మద్దతుగా ఈ నెల 8న నగరంలోని సరూర్‌నగర్ మైదానంలో యువ సంఘర్షణ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంక గాంధీ హాజరవనున్న సభకు నియోజకవర్గం నుంచి 5 వేల మందితో వెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి తాండూరు కంచుకోట అని గుర్తు చేశారు. పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీని బొందపెడతాం అంటూ వ్యాఖ్యలు చేశారన్నారు. కాంగ్రెస్ ఓటర్లతో ఎమ్మెల్యే అయిన రోహిత్ రెడ్డి మాటలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్దిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్, యాలాల, పెద్దేముల్ మండల అధ్యక్షులు భీమయ్య, గోపాల్, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నుంచి వెళ్లేవారు విమర్శిస్తారా

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

తాండూరు: బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోయే వారు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్ అన్నారు. శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీం, నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తాండూరు అభివృద్ధి ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నాలుగేళ్లలో చేసిచూపించారన్నారు. నర్సింగ్, ఐటీఐ కళాశాలల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు రోహిత్‌రెడ్డి చలువే అన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీకి నష్టం కలిగించేలా పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి వర్గమంతా పార్టీ నుంచి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారని ఆయన ఆరోపించారు. తాండూరు మార్కెట్ యార్డు విస్తరణకు 30 ఎకరాల భూమిని, రూ.30 కోట్ల నిధులు, రూ.50కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ చొరవతో నియోజకవర్గ అభివృద్ధికి ఏకకాలంలో రూ.134కోట్ల ప్రత్యేక నిధులను తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఈద్ మిలాప్ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్‌అలీ తాండూరులో పర్యటించినా.. ఎమ్మెల్సీ వర్గం దూరంగా ఉన్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ తాండూరుతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలో మూడు ఇంజినీరింగ్ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాల స్థాపించి అభివృద్ధి సాధించారని ఎద్దేవా చేశారు. రోహిత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి ఎమ్మెల్సీ కనిపించకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మెల్సీ వర్గం పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని పట్టణ అధ్యక్షులు నయీం విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రాఘవేందర్, ఆసీఫ్, విజయాదేవి, ముక్తార్‌నాజ్, ఉర్దూఘర్ చైర్మన్ రజాక్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సంతోశ్‌గౌడ్, నాయకులు ఇర్షాద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

యాచారం: మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో గురువారం రాత్రి హైనా దాడిలో ఒక దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన రాములు తన వ్యవసాయ పొలం వద్ద పాడి గెదేలను కట్టేసి గురువారం సాయంత్రం ఇంటికొచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా దూడ మృతి చెంది ఉంది. అదే విధంగా నస్దిక్‌సింగారం గ్రామంలో వీధి కుక్కల దాడిలో శుక్రవారం ఉదయం రైతు పుణ్యమూర్తి రాములుకు చెందిన దూడ మృతి చెందింది. వీధి కుక్కలు దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో దూడ అక్కడిక్కడే మృతి చెందింది.

మహిళ అదృశ్యం


లక్ష్మమ్మ(ఫైల్)

ఆమనగల్లు: మతిస్థిమితం సరిగా లేని మహిళ ఈ నెల 4న అదృశ్యమైంది.ఎస్‌ఐ సుందరయ్య తెలిపిన ప్రకారం.. అచ్చంపేట మండలం వలపట్ల గ్రామానికి చెందిన కాలె లక్ష్మమ్మ గురువారం ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో తప్పిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

25 మంది అరెస్టు

కడ్తాల్: గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 25మంది పేకాటరాయుళ్లను ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి ప్రకారం.. మండల పరిధిలోని మైసిగండి ఆలయ సమీపంలోని డీఎల్‌ఆర్ గెస్ట్ హౌస్‌లో పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సాయంత్రం ఎస్‌ఓటీ , స్థానిక పోలీసులు సంయుక్తంగా గెస్ట్ హౌస్‌పై దాడి చేసి గోల్కొండ ప్రాంతానికి చెందిన 25 మందిని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 20 సెల్‌ఫోన్లు, రూ.3.19లక్షల నగదు, ఐదు సెట్ల పేకలను స్వాధీనం చేసుకున్నారు. గెస్ట్ హౌస్ నిర్వహకుడితో పాటు, పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, ఎస్‌ఓటీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అకారణంగా యువకుడిపై దాడి

నిందితుడి రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: అకారణంగా దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన రఫీ ఏప్రిల్ 24న రాత్రి 11గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో బైక్ ఆగిపోవడంతో సమీపంలోని పెట్రోల్ బంక్‌కు వెళ్లి సిబ్బందితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో బాటసింగారం గ్రామానికి చెందిన మాదారం సాయికార్తీక్ అలియాస్ మున్నా మరో ముగ్గురు యువకులతో కలిసి రఫీపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం మున్నాను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ఎమ్మెల్యేకు ఆశీర్వచనం చేస్తున్న వేదపండితులు


అమ్మవారి పూజలో మాజీ మంత్రి చంద్రశేఖర్

ప్రజా ప్రతినిధులు, నేతల ప్రత్యేక పూజలు

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయని ఉత్సవ కమిటీ చైర్మన్ శంకరయ్యగౌడ్, సర్పంచ్ మల్లయ్య అన్నారు. మొదటి రోజు ఎమ్మెల్యే ఆనంద్, ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ మల్లయ్య, మాజీ మంత్రులు డాక్టర్ ఎ.చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ఆయా పార్టీల నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని మొగిలిగుండ్ల గ్రామంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్

- గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం
- రెగ్యులరైజ్ చేయకుంటే ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తాం
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం


జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్న ప్రొఫెసర్ కోదండరాం

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్)రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 8వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ జూనియర్ కార్యదర్శులు నోటిఫికేషన్‌లోనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి.. నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలం పూర్తైనా క్రమబద్ధీరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణ రాష్ట్రానికి, గ్రామ పంచాయితీలకు జాతీయ స్థాయిలో అవార్డులను సాధించడంలో జేపీఎస్‌ల కృషి ఎంతో ఉందన్నారు. జేపీఎస్‌ల సమ్మెకు ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు పూర్తి మద్దతు తెలపాలని కోరారు. రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులతో రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కలిసికట్టుగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఔట్ సోర్సింగ్, పంచాయతీ జూనియర్ క్యాదర్శుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను వెంటనే నిర్మించాలి

నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తామన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే చేపట్టాలని ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. సాగునీటికి పెద్ద పీట వేస్తామని చెపుతున్న సీఎం కేసీఆర్ దక్షిణ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వేగవంతంగా చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కేవీ రంగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, తాలుకా అధ్యక్షుడు శ్రీరామ్, పంచాయతీ జూనియర్ కార్యదర్శులు జగదీశ్, ప్రమోద్, శ్రీరామ్, పాండురంగారెడ్డి, ఫయాజ్, అశోక్, వెంకటేశ్, స్వప్న, రజని, శ్వేత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.


గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఆలయ పూజారులు, నేతలు

శోభాయమానం.. పాంబండ గిరిప్రదక్షిణం

బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శుక్రవారం గిరిప్రదక్షిణ శోభాయమానంగా కొనసాగింది. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు కాషాయ జెండాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాండుశర్మ, రాములు, వెంకటయ్య, శ్రీను పాల్గొన్నారు.

– కుల్కచర్ల